


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శుక్రవారం
24-01-2025
పేజీలు: 02

## ఆస్తి కోసం స్నేహితుడి భార్యను కిడ్నాప్ చేసిన కాంగ్రెస్ నేత

షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మహేందర్, తిమ్మాపూర్‌కు చెందిన ఎడ్ల శ్రీకాంత్ ఇద్దరు స్నేహితులు. ఇద్దరు కలిసి గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు.. అయితే గత సంవత్సరం శ్రీకాంత్ అనారోగ్యంతో మృతి చెందాడు. శ్రీకాంత్ భార్య రాధికకు తన తల్లిదండ్రులు ఒక ఎకరం భూమి ఇచ్చారు.. ఈ భూమి మీద కాంగ్రెస్ నేత మహేందర్ కన్నుపడింది. రాధికకు తరచూ ఫోన్ చేసి శ్రీకాంత్ రియల్ ఎస్టేట్లో పెట్టిన పెట్టుబడుల వివరాలు చెబుతానని మహేందర్ నమ్మబలికాడు.. వివరాల కోసం వచ్చిన రాధికను ఈ నెల 20న తన కారులో బలవంతంగా కిడ్నాప్ చేశాడు. తిరుపతికి తీసుకెళ్తూ మధ్యలో మహేందర్‌తో పాటు అతడి డ్రైవర్ శేఖర్ కత్తితో బెదిరించి రాధిక చేతికి ఉన్న ఉంగరంతో పాటు, కొంత నగదు తీసుకొని ఖాళీ బాండ్ పేపర్లపై సంతకాలు చేయాలని బలవంతం చేశారు. రాధిక ఈనెల 20 నుంచి కనిపించడం లేదని శ్రీకాంత్ తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఈనెల 22న రాధిక తప్పించుకొని కొత్తూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. మహేందర్ తనను కిడ్నాప్ చేసి, బలవంతంగా ఖాళీ బాండ్ పేపర్లపై సంతకాలు చేయించుకున్నాడని చెప్పింది.. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు మహేందర్, డ్రైవర్ శేఖర్‌ను అరెస్ట్ చేశారు. వీరు నేరం ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించారు.

## భర్త దొంగతనాలు మానకపోవటంతో.. ఇద్దరు కుమార్తెలతో సహా ఉరి వేసుకొని తల్లి ఆత్మహత్య

తల్లితండ్రులను ఎదిరించి మతాంతర వివాహం చేసుకున్న ఆమెకు భర్త తీరు మనసు విరిగి కఠిన నిర్ణయం తీసుకున్న భార్య, ఖమ్మం జిల్లా మధిర మండలం నిదానపురం గ్రామంలో చోటు చేసుకున్న ఘటన. ఐదేళ్ల క్రితం విజయవాడ నుంచి మధిరకు బస్సులో వస్తుండగా.. మధిర మండలం నిదానపురానికి చెందిన షేక్ బాజీ ఆమె పక్క సీట్లో కూర్చున్నపుడు అక్కడ వారిమధ్య ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారడంతో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. మౌనిక తల్లిదండ్రులు అందుకు ఒప్పుకోకపోవటంతో ఆమె బాజీతో వెళ్లిపోయి పెళ్లి చేసుకుంది. వీరికి మెహక్ (4), మెనురూల్ (3) అనే కుమార్తెలు ఉన్నారు. ఉద్యోగం చేస్తున్నానని చెప్పిన బాజీ.. నిజానికి పలు చోరీ కేసుల్లో నిందితుడని మౌనికకు తెలిసింది. దీంతో చోరీలు మానేయాలని భర్తకు నచ్చజెప్పింది.. అయినా అతడిలో మార్పు రాలేదు,అయితే ఓ దొంగతనం కేసులో భర్తను పోలీసులు తీసుకెళ్లడంతో.. అవమానంతో ఇద్దరు కుమార్తెలకు ఉరి వేసి తాను ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపిన బంధువులు.

# గాంధీ తాత చెట్టు రివ్యూ




క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ `పుష్ప 2`తో సంచలనాలు సృష్టించారు. ఆయన భార్య తబిత ఇటీవలే నిర్మాతగా మారింది. ఇప్పుడు ఆయన కూతురు సుకృతి వేణి కూడా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆమె బాలనటిగా వెండితెరకు పరిచయం అవుతూ `గాంధీ తాత చెట్టు` సినిమాలో నటించింది. ఆనంద్ చక్రపాణి, రఘురామ్, రాగ్ మయూర్,భాను ప్రకాష్, నేహాల్ ఆనంద్ కుంకుమ నటించిన ఈ చిత్రానికి పద్మావతి మల్లాది దర్శకురాలు. తబితా సుకుమార్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్, నవీన్ ఎర్నేని, వై రవిశంకర్, శేష సింధురావు కలిసి నిర్మించారు. ఈ మూవీ నేడు శుక్రవారం(జనవరి 24)న విడుదలైంది. మరి ఇప్పటికే దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్ వంటి పలు అవార్డులు అందుకున్న ఈ మూవీ ఆడియెన్స్ ని ఆకట్టుకోవడంలో సక్సెస్ అయ్యిందా? అనేది రివ్యూలో తెలుసుకుందాం.

ఈ మూవీ గాంధీ అనే అమ్మాయి, ఆమె తాత, ఆయన పెంచిన చెట్టు చుట్టూ తిరిగే కథ. నిజామాబాద్ జిల్లా అడ్లూర్ అనే విలేజ్‌లో రామచంద్రయ్య(ఆనంద చక్రపాణి)కి గాంధీ సిద్ధాంతాలు అంటే చాలా ఇష్టం. తన తండ్రి నేర్పిన గాంధీ తత్వాన్ని నమ్ముతూ బతుకుతుంటారు. తనకు పదెకరాల పొలం ఉంటుంది. అందులో వేపచెట్టు నాటుతాడు.

ఆ చెట్టునే జీవిగా భావించి దానితో మాట్లాడుతుంటాడు. తన కష్టసుఖాలు పంచుకుంటాడు. దీంతో ఆ చెట్టుతో ఆయనకు ఎంతో అనుబంధం ఏర్పడుతుంది. గాంధీపై ఉన్న ప్రేమతో తన మనవరాలుకి గాంధీ(సుకృతి వేణి) అని పేరుపెడతాడు. ఆమెకి కూడా గాంధీ గురించి, ఆయన శాంతియుత పోరాటం గురించి నేర్పిస్తాడు. ఆ చెట్టుతో ఉన్న అనుబంధం గురించి చెబుతాడు. ఊరు మొత్తం షుగర్ ఫ్యాక్టరీపై ఆధారపడి బతుకుతుంటారు. అది మూత పడుతుంది. దీంతో ఉపాధి లేక ఊరి జనం అవస్తలు పడుతుంటారు. భూములు అమ్ముకుని పట్నం వెళ్లిపోవాలనుకుంటారు. దీన్ని ఆసరగా తీసుకుని పెద్ద కంపెనీ వాళ్లు కొత్త ఫ్యాక్టరీ పెడతామని చెప్పి ఆ ఊరు ప్రజల వద్ద భూములు లాక్కుంటారు. రామచంద్రయ్య ల్యాండ్ కోసం ప్రయత్నిస్తుంటారు.కానీ ఆయన నో చెబుతాడు. కొడుకు అమ్మేయాలనుకుంటాడు. దీనికి రామచంద్రయ్య అడ్డుపడటంతో కొడుకు అవమానిస్తాడు. ఊర్లోనూ అవమానాలు జరుగుతాయి. ఇది తట్టుకోలేని రామచంద్రయ్య చనిపోతాడు. మరి ఆయన మరణంతో ఆ ఊర్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి? రామచంద్రయ్య పెంచిన చెట్టుని గాంధీ ఎలా కాపాడింది? తమ భూములను తిరిగి పొందేందుకు గాంధీ ఊరు ప్రజలతో కలిసి ఏం చేసింది? తన ఆలోచనలతో తన తండ్రిని ఎలా మార్చింది? గాంధీ తత్వంతో ఊరు కోసం ఏం చేసిందనేది మిగిలిన కథ.

`గాంధీ తాత చెట్టు` టైటిల్ తగ్గట్టుగానే ఇది ఈ మూడు పాత్రలు చుట్టూ సాగే కథ. గాంధీ అనే అమ్మాయి, తన తాత నాటిన చెట్టుని కాపాడేందుకు చేసిన శాంతియుత పోరాటమే ఈ మూవీ. ఒక మంచి ప్రకృతి సందేశాన్ని, అదే సమయంలో కార్పొరేట్ కుట్రను, పల్లె గొప్పతనాన్ని అంతర్లీనంగా తెలియజేసే మూవీ ఇది.గాంధీ ఉప్పుసత్యగ్రహం వంటి శాంతియుత ఉద్యమాలు చేసి స్వాతంత్ర్యం తెచ్చినట్టు, గాంధీ సిద్ధాంతాలను నమ్మి ఊరు కోసం గాంధీ అనే అమ్మాయి చేసే శాంతియుత ఉద్యమం ఇందులో ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యే పాయింట్. సినిమా ప్రారంభంలో గాంధీ పాత్ర, ఆమె తాత, ఆయన నాటిన చెట్టు, వారి మనోభావాలను తెలియజేస్తుంది.అదే సమయంలో ఊర్లో ఉన్న సమస్యలను చూపించారు. దీంతో సినిమా ప్రారంభమైన కాసేపటికే కథలోకి ఇన్‌వాల్వ్ అయ్యేలా చేస్తుంది. ఊర్లో చెక్కర ఫ్యాక్టరీ మూత పడటంతో చెరకునే నమ్ముకుని బతికిన ఆ ఊరు జనం పరిస్థితి రోడ్డున పడ్డట్టుగా మారుతుంది. దీన్ని ఆసరాగా చేసుకుని మంత్రికి చెందిన వాళ్లు అక్కడ కెమికల్ ఫ్యాక్టరీ పెట్టే ప్లాన్ చేయడం, రైతులు భూములు అమ్ముకునేలా ఉసిగోల్పడం, దాన్ని రామచంద్రయ్య అడ్డుకోవడం వంటి సన్నివేశాలు ఎమోషనల్‌గా ఉంటాయి.

ఫస్టాఫ్ అంతా ఆ భూములు అమ్మడం, ఫ్యాక్టరీ ప్రతినిధి(రాగ్ మయూర్)ని వ్యతిరేకించడం, తీరా కొడుకు సైతం తండ్రిని తిట్టడం వంటి నాటకీయ పరిణామాలు రక్తికట్టిస్తాయి. ఆ తర్వాత ఆయన చనిపోయిన తర్వాత తాత పెంచిన చెట్టుని రక్షించుకునేందుకు మనవరాలు గాంధీ పడే తపన మరింతగా ఆకట్టుకుంటుంది.ఈ క్రమంలో ఫ్యాక్టరీ ప్రతినిధిని ఎదురించేందుకు ఆమె చేసే ప్రయత్నం, ఊర్లో డబ్బులు సంపాదించేందుకు తాను కష్టపడటం వంటి సన్నివేశాలు మరింతగా ఆలోచింప చేస్తాయి. సినిమా క్లైమాక్స్ మాత్రం ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది. అదే సినిమాకి హైలైట్. ఫస్టాఫ్ కాస్త స్లోగా సాగినా, సెకండాఫ్ ఆ లోటుని తీరుస్తుంది.



## త్వరలో RTCలో నియామకాలు: మంత్రి

TGSRTCలో త్వరలో 3038 మంది డ్రైవర్లు, కండక్టర్లతో పాటు కారుణ్య నియామకాలు చేపడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. 3500 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందినా గత ప్రభుత్వం నియామకాలు చేపట్టలేదని, కొత్త బస్సులు కొనలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం 2000 కొత్త బస్సులు కొనుగోలు చేసిందని, మరో 600 బస్సులను డ్వాక్రా సంఘాలు కొంటాయని చెప్పారు. HYDలో పూర్తి స్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడతామని తెలిపారు.

## DSC నోటిఫికేషన్ ఎప్పుడంటే?

రాష్ట్రంలో మరో DSC నోటిఫికేషన్ APR తర్వాతే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. జాబ్ క్యాలెండర్ ప్రకారం FEBలోనే నోటిఫికేషన్ రావాలి. కానీ SC వర్గీకరణ కోసం కమిషన్ వేసిన సర్కార్ నివేదిక కోసం ఎదురుచూస్తోంది. దీనికి సమయం పట్టే అవకాశం ఉండటంతో అప్పటివరకు DSC నోటిఫికేషన్ రాకపోవచ్చని తెలుస్తోంది. ఇక గతేడాది 11,062 పోస్టులు భర్తీ చేసిన ప్రభుత్వం మరో 5వేల పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చే ఛాన్స్ ఉంది.

## ఈ బ్లడ్ గ్రూప్ వారు నాన్‌వెజ్ తింటున్నారా?

కొందరికి నాన్‌వెజ్ లేనిదే ముద్ద దిగదు. ఎక్కువ మంది చికెన్, మటన్ తినడానికి ఇష్టపడతారు. కొన్ని బ్లడ్ గ్రూపుల వారు మాంసాహారం తినడం మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. A బ్లడ్ గ్రూప్ వారికి రోగనిరోధక వ్యవస్థ సున్నితంగా ఉండి జీర్ణవ్యవస్థ సరిగ్గా పనిచేయదు. చికెన్, మటన్ వంటివి జీర్ణించుకోలేరు. వీరు పప్పులు, కూరగాయలు తినడం బెటర్. B గ్రూప్ వారు ప్రతిదీ తినొచ్చు. AB, O గ్రూప్ వారు సమతుల్యంగా తినాలి.

## న్యూయార్క్ స్కూళ్లలో మొబైల్ బ్యాన్?

USలోని న్యూయార్క్ స్కూళ్లలో మొబైల్ వాడకంపై నిషేధం విధించే యోచనలో ఉన్నామని ఆ రాష్ట్ర గవర్నర్ కతి హోచుల్ తెలిపారు. ఇప్పటికే నగరంలోని 1500కు పైగా పబ్లిక్ స్కూళ్లలో సెల్ ఫోన్ వాడకంపై పరిమితులు విధించారని చెప్పారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, చదువుపై ఫోకస్ చేసేందుకు ఈ ప్రణాళిక రచిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, అక్కడి స్కూళ్లలో 97% మంది విద్యార్థులు క్లాస్ నడిచేటప్పుడే ఫోన్ వాడుతున్నారని అంచనా.

## ఇకపై ఎవరెస్ట్ ఎక్కాలంటే రూ.13 లక్షలు కట్టాల్సిందే

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శిఖరం ఎవరెస్ట్‌ను అధిరోహించడానికి చెల్లించాల్సిన ఫీజును నేపాల్ పెంచింది. ఇకపై ఎవరెస్ట్ ఎక్కాలంటే విదేశీ పర్యాటకులు రూ.13 లక్షలు (15 వేల డాలర్లు) చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఇది రూ.9.5 లక్షలుగా ఉండేది. పెరిగిన ధరలు ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి అమలులోకి వస్తాయి. కాగా వచ్చిన డబ్బుతో క్లీన్ అప్ డ్రైవ్స్, వేస్ట్ మేనేజ్‌మెంట్, ట్రెక్కింగ్ కార్యక్రమాలకు వినియోగిస్తారు.





## కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తులు.. 10 కోట్ల మంది పుణ్యస్నానాలు

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. ఈ కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 10 కోట్ల మందికిపైగా పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.ఈనెల 13వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ 10.21 కోట్ల మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ సర్కార్ వెల్లడించింది. ఇక అత్యంత కీలకమైన మౌనీ అమావాస్య అయిన జనవరి 29న రానుంది. ఆ రోజు ఏకంగా 10 కోట్ల మంది కంటే అధికంగా భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. ఈ నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం యోగీ ఆదిత్యనాథ్ ఆదేశించారు. సంక్రాంతి రోజున ప్రారంభమైన (జనవరి 13) మహా కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో ముగుస్తుంది. 45 రోజులపాటు సాగనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల సంఖ్య 50 కోట్లు దాటుతుందని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో కోట్లాది మందికి తగిన రీతిలో ఏర్పాటు చేసింది యూపీ ప్రభుత్వం. సుమారు లక్షా 60 వేల టెంట్లను ఏర్పాటు చేశారు. లక్షా 50 వేల టెయిలెట్లను నిర్మించారు. దాదాపు 15వేల మంది శానిటేసన్ వర్కర్లు పనిచేయనున్నారు. 1250 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ వేశారు. 67 వేల ఎల్ఈడీ లైట్లు, రెండు వేల సోలార్ లైట్లు, మూడు లక్షల వృక్షాలను ఏర్పాటు చేశారు.

## రవన్న మాస్ దావత్ షురూ

టాలీవుడ్ యాక్టర్ రవితేజ కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం రవితేజ 75. మాస్ జాతర టైటిల్‌తో రాబోతుంది. డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. తాజాగా మాస్ జాతర స్టన్నింగ్ లుక్ ఒకటి షేర్ చేశారు. రవన్న మాస్ దావత్ షురూ రా భయ్. జనవరి 26న రవితేజ పుట్టినరోజు సందర్భంగా మాస్ జాతర మాస్ ర్యాంపేజ్ గ్లింప్స్ రాబోతుందంటూ కొత్త లుక్ షేర్ చేశారు. రవితేజ భోజనం చేసేందుకు కూర్చుని కోర మీసం మెలేస్తూ కనిపిస్తున్నాడు. అభిమానులు, ఫాలోవర్లకు కావాల్సిన పసందైన విందు భోజనంలా మాస్ జాతర ఉండబోతున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. ఈ సినిమాతో సామజవరగమన ఫేం రైటర్ భాను బొగవరపు డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. పేరు లక్ష్మణ భేరి.. ఆదాయం చెప్పను తియ్.. ఖర్చు లెక్క జెయ్యన్.. రాజ్యపూజ్యం అన్ లిమిటెడ్..అవమానం జీరో అంటూ ఇప్పటికే ఓ అప్‌డేట్ ఇచ్చి సినిమాపై అంచనాలు పెంచేస్తున్నారు. మాస్ మహారాజా బెంచ్ మార్క్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రంలో మాస్ మహారాజా పాత్ర ఎలా ఉండబోతుందో తాజా స్టిల్‌తో హింట్ ఇచ్చేశారు మేకర్స్. ఈ మూవీని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి బలగం ఫేమ్ భీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు. హ్యాపీ ఉగాది రా భయ్.. రవన్న దావత్ ఇస్తుండు రెడీ అయిపోండ్రి అంటూ పోస్టర్ పెట్టిన క్యాప్షన్స్ పక్కా తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో సాగనున్నట్టు క్లారిటీ ఇచ్చేస్తుంది.



సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com

# పెళ్లిపై జాన్వీ కామెంట్స్..

అందాల భామ జాన్వీ కపూర్ ప్రస్తుతం నార్త్‌లోనే కాకుండా సౌత్‌లోనూ ది మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది. ఆమె తెలుగు ప్రేక్షకులకు 'దేవర' చిత్రంతో దగ్గరయ్యింది. ఇక జాన్వీ తరుచూ తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి వస్తూ ఉండటం కూడా తెలుగు ప్రేక్షకులకు ఆమెను మరింత చేరువ చేసింది. కాగా, ఆమె ప్రస్తుతం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సరసన RC16 మూవీలో నటిస్తోంది. అయితే, తాజాగా జాన్వీ కపూర్ తన పెళ్లి, పిల్లలు పై చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. బాలీవుడ్‌లో జరిగిని ఓ ఇంటర్వ్యూలో జాన్వీ కపూర్ ఈ మేరకు కామెంట్స్ చేసింది. పెళ్లి చేసుకుని తన భర్తతో తిరుపతి నగరంలో సెటిల్ అవ్వాలని తనకు ఉందని.. ముగ్గురు పిల్లల్ని కనాలని.. అటుపై అరిటాకులో భోజనం పెట్టుకుని గోవింద నామస్మరణతో తినాలని తన కోరిక అంటూ ఆమె పేర్కొంది.ఇక తన భర్తను లుంగీ వేసుకోమని తాను చెబుతానని జాన్వీ తెలిపింది. ఇలా తన పెళ్లి, పిల్లలు, జీవితంపై జాన్వీ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## మీర్‌పేట హత్య కేసులో

# కీలక ఆధారాలు లభ్యం..

మీర్‌పేట హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల దర్యాప్తులో పలు కీలక ఆధారాలు లభించాయి. శరీర అవయవాలు కాల్చిన ఆనవాళ్లను పోలీసులు సేకరించారు. హత్యకు ఉపయోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కాల్చిన ఆనవాళ్లలో డీఎన్‌ఏ సేకరించారు, దొరికిన డీఎన్‌ఏతో పాటు పిల్లల డీఎన్‌ఏతో పోలీసులు టెస్ట్ చేయనున్నారు. 2018లో ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన నరబలి కేసులో బ్లూరేస్ లైటింగ్ సాంకేతిక పరిజ్ఞానంతో గోడ రంధ్రాలు, ఫ్లోరింగ్ టైల్స్ మధ్యలో ఉన్న శుభ్రం చేసిన తరువాత కూడా మిగిలిపోయిన రక్తనమూనాలను సేకరించి ఆధారాలను రాబట్టిన విషయం తెలిసిందే. అదే పరిజ్ఞానాన్ని ప్రస్తుతం ఈ కేసులో కూడా పోలీసులు ఉపయోగించారు. కాగా, గురుమూర్తే తన భార్యను హత్యచేసినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. గురుమూర్తిని ఇంటిని తీసుకెళ్లి మరోసారి తనిఖీ చేశారు. ఇంట్లో రక్తపు ఆనవాళ్లు, వెంట్రుకలు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటిని ఫోరెన్సిక్ విభాగానికి అప్పగించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నారు. అనంతరం రిమాండ్‌కు తీసుకొని మరోసారి ప్రశ్నించనున్నారు. జిల్లెలగూడలోని వెంకటేశ్వరనగర్‌లో నివాసముండే గురుమూర్తి, వెంకట మాధవి దంపతుల మధ్య సంక్రాంతి పండుగకు ఊరికి వెళ్లాలనే విషయంలో గొడవ జరిగినట్లు తెలిసింది. 14వ తేదీ తమ ఇద్దరు పిల్లలను గురుమూర్తి తన బంధువుల ఇంట్లో దింపి రాగా, 15వ తేదీన ఇద్దరి మధ్య గొడవ జరగడంతో గురుమూర్తి మాధవిని కొట్టి చంపినట్లు వెల్లడైంది. అదేరోజు కనుము పండుగ కావడంతో ఆమె శరీరాన్ని ముక్కలుగా కోసి ఆధారాలు లేకుండా చేయాలని ప్లాన్ చేశాడు. ఆ ఇంట్లో ఉన్న మిగతా కిరాయిదారులు కూడా పండుగకు ఊరెళ్లడంతో ఆ ఇంటి ఆవరణలో ఎవరు కూడా లేరు. దీంతో పక్కింట్లో ఉన్న వారు ఎవరు కూడా తమపై దృష్టి సారించేందుకు అవకాశముండదని, ఏదైనా వాసన వచ్చినా పండుగ రోజు కాబట్టి ఏదో చేసుకుంటున్నారనే ధోరణి ఉంటుందని భావించాడు. హత్య చేసిన తరువాత ఆమె శరీర భాగాలను ముక్కలుగా కోసి, వాటిని హీటర్‌లో మరుగ పెట్టి, ఆ తరువాత బయటపడ్డ బొక్కలను కుక్కర్‌లో ఉడికించి, దీనికి పెద్ద స్టౌవ్‌ను వాడాడు. ఆ తరువాత వాటిని మిక్సీలో వేసి పొడి చేసి, వాటన్నింటిని టాయిలెట్‌లో వేసి ఫ్లష్ చేసినట్లు నిందితుడు వెల్లడించడంతో అన్ని విషయాలను పోలీసులు పరిశీలించారు. హీటర్, కుక్కర్, టాయిలెట్, మాంసం కొట్టే చెక్క మొద్దు, గోడలపై ఉండే రక్తపు మరకలు, అక్కడ లభించిన వెంట్రుకుల, గాజులు ఇలా చిన్న చిన్న వస్తువులను ఫోరెన్సిక్ విభాగం సేకరించింది. ఆధారాలు బయట పడకుండా ఉండేలా ఇల్లు, బాతురూమ్, గోడలను శుభ్రం చేసినా క్లూస్ టీమ్‌తో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో అక్కడ ఆధారాలు సేకరించినట్లు సమాచారం. అయితే సేకరించిన ఆధారాలను విశ్లేషించి పోలీసులు ఈ హత్య విషయంలో ఒక నిర్ధారణకు రానున్నారు.



**సీసీ కెమెరాలు కీలకం!**

భార్యను హత్య చేసి ఆధారాలు లేకుండా చేసిన తరువాతే గురుమూర్తి తన అత్త మామలకు ఫోన్ చేశాడు. ఆ తరువాత 18వ తేదీన వారితో కలిసి వెళ్లి మీర్‌పేట్ పోలీసులకు మిస్సింగ్‌పై ఫిర్యాదు చేశాడు. గురుమూర్తిపై అనుమానంతో పోలీసులు సీసీ కెమెరాలను తనిఖీ చేయగా.. 14వ తేదీన మాధవి ఇంట్లోకి వెళ్లినట్లు ఉన్నది.. ఆ తరువాత ఆమె బయటకు వచ్చిన ఆనవాళ్లు లేకపోవడంతో పక్కా ప్లాన్‌తో హత్య చేశాడని పోలీసులు భావిస్తున్నారు. దాంతో పాటు సీసీ కెమెరాలలో గురుమూర్తి ఏదో సంచిలో తీసికెళ్లిన ఆనవాళ్లు కూడా లభించాయి. బీఎన్ఎస్ చట్టంలో ఎలక్ట్రానిక్‌కు సంబంధించిన సాక్ష్యాలు కూడా చెల్లుతాయి. దీంతో క్లూస్ టీమ్ ఇచ్చే సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరాల ఫుటేజీలు ఇప్పుడు పోలీసులకు కీలకంగా మారనున్నాయి. ఇదిలా ఉండగా పోలీసులు ఈ ఘటనపై ఎవరూ స్పందించడంలేదు. గురుమూర్తి చెబుతున్న మాటలు ఎంత వరకు నిజమనేది కూడా అనుమానిస్తున్నారు. మరో పక్క గురుమూర్తికి మరో మహిళతో సంబంధాలున్నాయనే అనుమానాలు రావడంతో, మాధవిని వదిలించేందుకు పక్కా ప్లాన్‌తో సంక్రాంతికి అందరిని పంపించేసి హతమార్చాడా? అనే కోణంలోనూ పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై ఒకటి రెండురోజుల్లో పూర్తి స్పష్టత ఇస్తామని పోలీసులు పేర్కొంటున్నారు. మాధవి హ్యాత మిస్టరీని పోలీసులు ఎలా ఛేదిస్తారన్నది సందిగ్ధంగా మారింది. పోలీసులు మాత్రం ఇప్పటికీ హత్య జరిగినట్లు ఎక్కడా చెప్పడం లేదు. మాధవి అదృశ్యంగానే భావిస్తున్నామని మీర్‌పేట సీఐ నాగరాజు తెలియజేస్తున్నారు.



## విడాకులు తీసుకోనున్న సెహ్వాగ్?

భారత మాజీ డాషింగ్ ఓపెనర్ సెహ్వాగ్ వివాహ బంధానికి స్వస్తి పలకనున్నట్లు తెలుస్తోంది. భార్య ఆర్తి అహ్లావత్ నుంచి విడాకులు తీసుకోనున్నట్లు HT పేర్కొంది. వీరిద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడంతో పాటు కొన్ని నెలలుగా విడిగా ఉంటున్నట్లు తెలిపింది. 2004లో వీరికి పెళ్లి కాగా, ఇద్దరు కుమారులున్నారు. గత దీపావళి రోజు సెహ్వాగ్ ఒంటరిగా ఉన్న ఫొటోలు షేర్ చేయడం విడాకుల వార్తకు బలం చేకూరుస్తోంది.

## భారతీయులకు బిగ్ రిలీఫ్

అమెరికాలో జన్మత: వచ్చే పౌరసత్వాన్ని కొత్త అధ్యక్షుడు ట్రంప్ రద్దు చేయడంతో అక్కడి భారతీయుల్లో ఆందోళన నెలకొన్న విషయం తెలిసిందే. తాజాగా, అధ్యక్షుడి నిర్ణయాన్ని సియాటెల్ జడ్జి తాత్కాలికంగా నిలిపేయడంతో వారికి ఊరట దక్కినట్లైంది. ఫిబ్రవరి 20 తర్వాత పుట్టిన వారికి సిటిజన్ షిప్ రాదనే ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ఇండియన్స్‌తో పాటు USAకు వలస వెళ్లిన వారిని టెన్షన్ పెట్టిన విషయం తెలిసిందే.







## రూ.10 లక్షల వరకు నో IT?

నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో వేతన జీవులకు భారీ ఊరట దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం. వార్షికాదాయం రూ.10లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే, రూ.15లక్షల- రూ.20లక్షల ఆదాయం వరకు కొత్తగా 25% పన్ను శ్లాబ్‌ను తేవాలని భావిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం రూ.15లక్షల పైబడిన ఆదాయానికి 30% పన్ను విధిస్తున్న విషయం తెలిసిందే.

## ఏపీలో దట్టమైన పొగమంచు.. విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం


ఏపీలోని పలు జిల్లాలను పొగమంచు కమ్మేసింది. విజయవాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలను శుక్రవారం దట్టమైన పొగమంచు చుట్టుముట్టేసింది. అంతర్జాతీయ విమానాశ్రయం విజయవాడ గన్నవరంలో ముఖ్యంగా పొగమంచు కారణంగా ల్యాండ్ కావాలసిన విమానాలు గంటల పాటు ఆలస్యంగా నడుస్తున్నాయి. హైదరాబాద్ నుంచి ఇండిగో విమానానికి రన్‌వే విజిబులిటీ లేక గాల్లో చక్కర్లు కొట్టింది. హైదరాబాద్ , చెన్నై , విజయవాడ నుంచి విశాఖకు రెండు నుంచి మూడు గంటల పాటు ఆలస్యంగా చేరుకున్నాయని, విశాఖ విమానాశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి వివరించారు. శ్రీకాకుళం జిల్లాలో పొగమంచు వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.





## కంటైనర్‌తో వెళ్తున్న లారీ బోల్తా.. లక్డికాపూల్‌లో భారీగా ట్రాఫిక్ జామ్

కంటైనర్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడటంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే..మూసాపేట్ నుంచి కాటేదాన్ వెళ్తున్న లారీ లక్డికాపూల్ టర్నింగ్ వద్దకు రాగానే బోల్తా పడింది. ఈ ప్రమాంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో రోడ్డుపై రద్దీ లేకపోవడంతో వాహనదారులకు పెను ప్రమాదం తప్పింది. కంటైనర్ బోల్తా పడటంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాలను మరో రూట్లో మళ్లించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసే ప్రయత్నం చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## కరీనా, పనిమనిషి పాత్రలపై మళ్లీ డౌట్స్!

యాక్టర్ సైఫ్ అలీఖాన్ స్టేట్‌మెంటుకు దాడి జరిగిన రోజు సంఘటనలకు పొంతన కుదరడం లేదని కొందరు అంటున్నారు. 11వ ఫ్లోర్‌లో ఉన్న కరీనా, తాను జే రూమ్‌కు వెళ్లామని సైఫ్ చెప్పారు. ఆగంతకుడిని చూశాక జేను వేరే గదిలోకి తీసుకెళ్లామన్నారు. కరీనా తనతోనే ఉన్నప్పుడు దాడి జరగ్గానే ఆమే ఆస్పత్రికి ఎందుకు తీసుకెళ్లలేదన్నది ప్రశ్న? గదిలో బంధించిన షరీఫుల్ ఎలా తప్పించుకున్నాడు? ఈ ఘటనలో పని మనిషి పాత్రేంటో తెలియాల్సి ఉంది.